
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
1
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 3 జూన్ 2025



వచ్చేనెల 5న జాతీయ లోక్ అదాలత్

శ్రీకాకుళం లీగల్ జూన్ 2(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌ను జూలై 5న నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్ కేసులను కక్షిదారులు రాజీ చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు, న్యాయవాదులు, ప్రభుత్వ అధికారులు, పోలీసులు, ఇన్సూరెన్సు, బ్యాంకుల అధికారులు ఉపయోగించుకోవాలని తెలిపారు.



జ్ఞాన రుత్విక్‌సాయికి స్వీటు తినిపిస్తున్న తండ్రి శంకర నారాయణ

'జేఈఈ'లో సిక్కోలు సత్తా

● జ్ఞాన రుత్విక్‌సాయికి 18వ ర్యాంకు
● ఓబీసీ విభాగంలో ఒకటో స్థానం

నరసన్నపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. నరసన్నపేట మండలం మారుమూల గ్రామమైన దేవాదికి చెందిన ధర్మాన జ్ఞాన రుత్విక్‌సాయి ప్రతిభ చూపారు. 360 మార్కులకుగాను 310 మార్కులు సాధించి జాతీయస్థాయిలో ఓపెన్ కేటగిరి విభాగంలో 18వ ర్యాంకు.. ఓబీసీ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. జ్ఞాన రుత్విక్‌సాయి తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులే. తండ్రి ధర్మాన శంకరనారాయణ నరసన్నపేట మండలం చెన్నాపురం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తల్లి కొండల లత నరసన్నపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఫిజిక్స్ అసిస్టెంట్. జ్ఞానరుత్విక్ సాయి.. చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండేవారు. శ్రీకాకుళం మునసబుపేట గాయిత్రీ పాఠశాలలో ఎల్‌కేజీ నుంచి ఆరోతరగతి వరకు చదివారు. ఏడో తరగతి నుంచి ఇంటర్ వరకు విజయవాడలోని శ్రీచైతన్య విద్యాసంస్థల్లో చదివారు. పదోతరగతిలో 600 మార్కులకుగాను 587 మార్కులు, ఇంటర్‌లో 988 మార్కులు సాధించారు. ఇంటర్ చదువుతున్న సమయంలో ఫిజిక్స్ ఒలింపియాడ్ పోటీల్లో ప్రతిభ (మిగతా 2వ పేజీలో..)

విక్రమ రాజా.. 216వ ర్యాంకు



ఎచ్చెర్ల: ఎచ్చెర్ల మండలం అల్లినగరంలో నివాసం ఉంటున్న బుడుమూరు విక్రమరాజా జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో 360 మార్కులకు గాను 275 మార్కులు సాధించారు. ఓపెన్ కేటగిరీలో 216వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 30వ ర్యాంకు పొందారు. విక్రమరాజా స్వస్థలం పొందూరు మండలం పిల్లలవలస. ఈ విద్యార్థి తండ్రి సోమరాజు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు కాగా, తల్లి కళ్యాణి ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్నారు. విక్రమరాజా ఇంటర్మీడియట్ సీబీఎస్‌సీ సిలబస్‌లో 95 శాతం మార్కులు, పదో తరగతిలో 591 మార్కులు సాధించారు. చెన్నై ఐఐటీలో ఈసీఈ బ్రాంచ్‌లో ఇంజనీరింగ్ పూర్తిచేసి, సివిల్స్ సాధించాలన్నదే తన ఆశయమని విక్రమరాజా తెలిపారు.

వెంకట శ్రీవినయ్.. 334వ ర్యాంకు



పొందూరు: పొందూరు మండలం అచ్చిపోలవలస పంచాయతీ సింగూరు గ్రామానికి చెందిన పైడి వెంకట శ్రీవినయ్.. జేఈఈ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 334వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 50వ ర్యాంకు సాధించారు. విద్యార్థి తండ్రి పైడి శ్రీహరి విశాఖపట్నంలోని సెంట్రల్‌జైల్‌లో హెడ్ కానిస్టేబుల్. తల్లి కౌసల్య గృహిణి. శ్రీవినయ్ విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ పూర్తిచేశారు. తల్లిదండ్రులతోపాటు తాత వెంకటనర్సయ్య ప్రోత్సాహంతోనే ఈ ర్యాంకును సాధించానని శ్రీ వినయ్ తెలిపారు. ఐఐటీ ముంబైలో కంప్యూటర్‌సైన్స్ చదవాలన్నదే తన ఆశయమని, ఐఏఎస్ చదివి దేశానికి సేవ చేయాలన్నదే తన లక్ష్యమన్నారు.

రోనిత్రాం నాయుడు.. 1,692వ ర్యాంకు



రణస్థలం: రణస్థలం మండలం గొర్లెపేటకు చెందిన ముల్లు రోనిత్రాంనాయుడు జేఈఈ ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ విభాగంలో 1,692 ర్యాంకు, ఓబీసీలో 293 ర్యాంకు సాధించారు. రోనిత్రాంనాయుడు విశాఖపట్నంలోని నారాయణ కళాశాలలో చదువుతున్నారు. తండ్రి ముల్లు శ్రీనివాసరావు జి.సిగడాం ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి మజ్జి మోహిని టెక్కలి మండలం చాకిపల్లి జడ్పీ హైస్కూల్లో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.

నిర్మిత్.. 487వ ర్యాంకు



పాతపట్నం: పాతపట్నంలోని రత్నాలపేట వీధికి చెందిన శాసనపురి నిర్మిత్ ఓపెన్ కేటగిరిలో 487వ ర్యాంక్, ఈబీసీలో 29వ ర్యాంక్ సాధించారు. నిర్మిత్ తండ్రి గోపీకృష్ణ వ్యాపారి కాగా తల్లి విజయ గృహిణి.

రమణ.. 1,791వ ర్యాంకు



రణస్థలం మండలం లెంకపేట గ్రామానికి చెందిన పిపిని రమణ ఆలిండియా ఓపెన్ విభాగంలో 1,791 ర్యాంకు, ఓబీసీలో 313 ర్యాంకు సాధించారు. రమణ కూడా విశాఖపట్నంలోని నారాయణ కళాశాలలో చదువుతున్నారు. తల్లిదండ్రులు రామకృష్ణ, ఆదిలక్ష్మీ.. రణస్థలంలోని పండ్ల వ్యాపారం చేస్తున్నారు.

ప్రశాంత కార్తీక్.. 807వ ర్యాంకు



పాతపట్నం మండలం సరాలి గ్రామానికి చెందిన పప్పు ప్రశాంతకార్తీక్ ఓపెన్ కేటగిరిలో 807వ ర్యాంక్, ఓబీసీలో 124వ ర్యాంకు సాధించారు. ప్రశాంతకార్తీక్ తండ్రి ఈశ్వరరావు, తల్లి లత ప్రభుత్వ ఉపాధ్యాయులే.



సైకిల్‌తోనే జీవన ప్రయాణం

● రోజూ 24 కి.మీ. రాకపోకలు ● పండ్ల విక్రయంతో ఉపాధి

అరసవల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పై చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు **ఇప్పిలి వెంకటరమణ**. శ్రీకాకుళం మండలం లబ్బోడిపేట గ్రామం. రోజూ ఈయన లబ్బోడిపేట నుంచి 12 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణిస్తూ.. శ్రీకాకుళం పాత బస్టాండ్‌కు చేరుకుంటారు. సైకిల్‌పైనే జామపండ్లు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఆరేళ్లుగా రోజూ రానుపోనూ 24 కిలోమీటర్లు సైకిల్‌పైనే ప్రయాణిస్తూ.. పండ్లు విక్రయిస్తూ జీవితాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈ సైకిలే తన జీవన ప్రయాణానికీ తోడుగా నిలుస్తోందని వెంకటరమణ చెబుతున్నాడు.

ఇలా.. ఆధునిక ప్రపంచంలో గమ్యస్థానాలకు చేరుకునేందుకు బైక్‌లు, కార్లు, విమానాలు అందుబాటులోకి వచ్చినా.. ఇప్పటికీ చాలామంది సైకిల్‌ను వినియోగిస్తుండడం గమనార్హం. రోడ్లపై పండ్లు, కూరగాయలు, ఐస్‌క్రీమ్‌లు విక్రయించేవారు, గ్రామాల్లో దుస్తులు, స్టీలు సామాన్లు తదితరవి విక్రయించే చిరు వ్యాపారులు తమ ఉపాధికి రవాణా సాధనంగా నేటికీ సైకిల్‌నే వినియోగిస్తున్నారు. మరోవైపు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతోపాటు.. కొంతమంది పెద్దలు కూడా ఆరోగ్యం దృష్ట్యా సైకిల్ తొక్కుతున్నారు. సైకిల్ వినియోగం పర్యావరణ హితమే కాకుండా, శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

నేడు 'ప్రపంచ సైకిల్ దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనాలు.. 2లో



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

విద్యార్థుల ధ్రువపత్రాలు పెండింగ్ వద్దు

● అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు : జేసీ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్


శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): 'విద్యా సంవత్సరం ఆరంభం వేళ.. విద్యార్థుల ధ్రువపత్రాలు పెండింగ్‌లో ఉంచరాదు. అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాల'ని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక.. 'మీకోసం' కార్యక్రమంలో.. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 87 అర్జీలను స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ 'తహసీల్దార్ల వద్ద వివిధ సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్‌కు గల కారణాలు తెలియజేయాలి. సర్టిఫికెట్లు సకాలంలో జారీ చేయకపోతే విద్యార్థులు ఇబ్బందులు పడతారు. సత్వరమే సర్టిఫికెట్లు జారీ చేయాలి. రైస్‌కార్డులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. వాటికి సంబంధించి చర్యలు చేపట్టాలి. సచివాలయాల్లో పెండింగ్‌లో ఉన్న వివాహ ధ్రువపత్రాలు కూడా మంజూరు చేయాలి' అని ఆదేశించారు. అనంతరం జిల్లా అధికారులతో కలిసి టీబీ ముక్త్ భారత్ గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, ఉప కలెక్టర్ పద్మావతి, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అనిత, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కళ్యాణబాబు పాల్గొన్నారు.

పడిపోయిన జీడిపప్పు అమ్మకాలు

● పరిశ్రమల్లో పేరుకుపోయిన నిల్వలు
● ఆశించిన స్థాయిలో జరగని విక్రయాలు
● నష్టాలను అధిగమించేందుకు ఈ నెల 14 వరకూ వ్యాపారుల బంద్

4లో





అభివృద్ధికి నోచుకోని లావేరు మండలం తామాడ గ్రామం

ఆ 25 పంచాయతీలు!

● నాలుగేళ్లుగా ప్రత్యేకాధికారుల పాలనలో.. ● ఆర్థిక సంఘం నిధులకు గ్రహణం
● రూపాయి కూడా విడుదలకాని వైనం ● వైసీపీ పాలనలో నిర్వాకమే.. శాపం

రణస్థలం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి)

ఇలా.. జిల్లాలో పదుల సంఖ్యలో పంచాయతీలకు అప్పట్లో ఎన్నికలు జరగలేదు. జిల్లాలో 912 పంచాయతీలు ఉన్నాయి. వాటికి పాలకవర్గాలు ఉన్నాయి. రాజ్యాంగబద్ధంగా రావాల్సిన నిధులన్నీ వాటికి సర్దుబాటు అవుతున్నాయి. కానీ 2021లో వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకం చాలా గ్రామాలకు శాపంగా మారింది. ఉమ్మడి జిల్లాలో ఎన్నికలు జరగడంతో జిల్లావ్యాప్తంగా కొత్తగా 95 పంచాయతీలను ఏర్పాటు చేశారు. ఉన్న పంచాయతీల పరిధిలో గ్రామాలను విడగొట్టి కొత్తగా పంచాయతీలు ఏర్పాటు చేయాలని భావించారు. కానీ ఎక్కడికక్కడే స్థానికుల అభ్యంతరాలతో 25 పంచాయతీల్లో ఎన్నికలు జరగలేదు. ఆయా పంచాయతీల్లో ఉన్న దాదాపు 100 గ్రామాలు ప్రత్యేకాధికారి పాలనలో సాగుతున్నాయి. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం పంచాయతీ ఏర్పాటులో తలెత్తిన సమస్యలు పరిష్కరించలేదు. అటు పాలకవర్గాలు లేకపోవడంతో కనీసం పారిశుధ్య పనులు చేపట్టిన వారు కూడా లేకుండా పోతున్నారు. గ్రామాల్లో సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియడం లేదు. ముఖ్యంగా గ్రామాల్లో మౌలిక వసతులకుగాను అందించే ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి.

● ఆ మండలాల్లో అధికం..

జిల్లాలో ప్రధానంగా రణస్థలం, లావేరు, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, బూర్జ, పోలాకి, కోటబొమ్మాళి, హిరమండలం తదితర మండలాల్లోనే ఎక్కువగా పంచాయతీలకు ఎన్నికలు జరగలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్థిక సంఘం నిధులను వేరే మార్గాలకు మళ్లించేవారు. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులు వస్తున్నాయి. కానీ పాలకవర్గాలకు ఉన్న స్థానిక సంస్థలకు మాత్రమే కేటాయిస్తున్నారు. ఎన్నికలకు జరగని పంచాయతీలకు మొండిచేయి చూపడంతో ఆయా గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. కనీసం పారిశుధ్య పనులు చేపట్టేందుకు కూడా వీల్లేకుండా పోతోంది. ప్రత్యేకాధికారులుగా మండలస్థాయి అధికారులను నియమించడంతో వారు గ్రామాల వైపు తొంగి చూడడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజల బాధలు వర్ణనాతీతం. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఈ పంచాయతీలపై దృష్టిపెట్టాలని (మిగతా 2వ పేజీలో..)

● రణస్థలం మండలం రావాడ పంచాయతీలో రావాడ ఎస్సీ కాలనీ, ఉప్పివలస ఉన్నాయి. వల్లభరావుపేట పంచాయతీలో వెంకట్రావుపేట ఉంది. గతంలో ఉప్పివలస, వెంకట్రావుపేటను ఒక పంచాయతీగా చేయాలని భావించారు. మిగతా వాటిని వేర్వేరు పంచాయతీలుగా విభజించాలనుకున్నారు. కానీ రావాడ పంచాయతీలో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో రావాడ, వల్లభరావుపేట పంచాయతీలకు ఎన్నికలు జరగలేదు. ఫలితంగా దాదాపు ఐదు గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి లేకుండా పోయింది.

● లావేరు మండలంలో బెజ్జిపురం అతిపెద్ద పంచాయతీ. దీని పరిధిలో బొంతుపేట, బోరపేట, శిగిరికొత్తపల్లి గ్రామాలున్నాయి. గతంలో శిగిరికొత్తపల్లి కేంద్రంగా మరికొన్ని గ్రామాలు కలిపి పంచాయతీని ఏర్పాటు చేయాలని భావించారు. కానీ అభ్యంతరాలతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ఎన్నికలు కూడా నిలిచిపోయాయి. ఈ గ్రామాల్లో పాలకవర్గాలు లేకపోవడంతో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. పారిశుధ్య లోపం, తాగునీటి సమస్యలు వెంటాడుతున్నాయి.

● లావేరు మండలం తామాడ పంచాయతీ పరిధిలో ఆరు గ్రామాలున్నాయి. తామాడ ఒక్కటే ఒక్క పంచాయతీగా.. కొత్త రౌతుపేట, పాత రౌతుపేట, రాయినింగిరిపేట, నడుపూరుపేట, సూర్యనారాయణపురం గ్రామాలను కలిపి కొత్తగా పంచాయతీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ అప్పట్లో ఏకాభిప్రాయం కుదరలేదు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా కొందరు న్యాయస్థానానికి వెళ్లడంతో పంచాయతీ విభజన జరగకుండా స్టే వచ్చింది. దీంతో ఎన్నికలు జరగలేదు. ఆయా గ్రామాలను పట్టించుకునేవారు లేకపోయారు.



మఖరజోలలో నిర్వహిస్తున్న శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం

● తిలకించి.. పులకించిన భక్త జనం

2లో

మలేరియా నివారణ.. మన బాధ్యత

● డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మలేరియా నివారణ మనందరి బాధ్యత అని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత పేర్కొన్నారు. మలేరియా నివారణా మాసోత్సవాల సందర్భంగా స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద సోమవారం అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఏడురోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'మలేరియా వ్యాధి.. దోమకాటు వలన వస్తుంది. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తాం. మలేరియా అంతం మనతోనే. కొత్తగా ఆలోచిద్దాం.. ఉత్తేజం పొందుదాం' అని తెలిపారు. అనంతరం మలేరియా నివారణా ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ రాందాస్, డీపీఎంవో సత్యనారాయణ, డెమో వేంకటేశ్వరరావు, ఆశాలు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత

భార్య చనిపోయిన మూడోరోజే భర్త మృతి

● ఇద్దరూ కిడ్నీ బాధితులే ● అక్కుపల్లిలో విషాదం

4లో

5 నుంచి పాంచరాత్రి కల్యాణ మహోత్సవాలు

● శ్రీముఖలింగంలో ఏర్పాట్లు
● చివరి రోజున స్వామివారి చక్రతీర్థ స్నానం

4లో

మా భూములను ఇప్పించండి

● 'మీకోసం'లో రేగపాలెం రైతుల వేడుకోలు

2లో

ప్లాస్టిక్ నుంచి పొంచిఉన్న ప్రమాదం

● మంత్రి అచ్చెన్న ● దర్బార్‌లో వినతుల స్వీకరణ

4లో

ఈనాటి ఈ సైకిల్ ఏనాటిదో..

● ఇప్పటికీ ఈ వాహనంతోనే ఎందరికో అనుబంధం

సైకిల్.. ఒకప్పుడు జనం జీవితంలో ఓ భాగం. సైకిల్ ఉంటే ఆర్థికంగా కొంత స్థితిమంతుడిగానే పరిగణించే వారు. కాలంతో పాటు మనిషి జీవన విధానంలో... వినియోగించే వాహనాల్లో అనేక మార్పులు వచ్చాయి. అయినా ఇంకా కొంతమంది సైకిల్‌తో తమ అనుబంధం తీరిపోలే దంటున్నారు. తమ పనులలో సాయానికే కాదు.. తాము ఆరోగ్యంగా ఉండడానికీ సైకిల్ ఎంతగానో తోడ్పడిందని చెబుతున్నారు. మంగళవారం 'ప్రపంచ సైకిల్ దినోత్సవం' సందర్భంగా ఓసారి సైకిల్ ప్రియుల అనుభవాలను తెలుసుకుందాం.

సైకిల్‌తో స్థిరమైన ఆరోగ్యం..



అరసవల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నేను గత 25 సంవత్సరాలుగా నిత్యం ఉదయాన్నే కనీసం 30 నిమిషాలకు తక్కువ లేకుండా సైకిల్ తొక్కుతున్నాను. 8 కిలోమీటర్ల వరకు ఉంటుంది. సాధారణంగా ప్రతి మనిషికీ 60 ఏళ్లు దాటాక కండరాలు బలహీనపడుతుంటాయి. కానీ సైకిల్ తొక్కడం ద్వారా కండరాలు బలంగా ఉంటాయి. అంతే కాకుండా రోజంతా ఉత్సాహంగా ఉంటుంది. బరువు తగ్గి శరీరం అదుపులో ఉంటుంది. గుండెకు చాలా మేలు చేస్తుంది. అలాగే రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోకుండా సైక్లింగ్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రతి ఒక్కరూ కనీసం 6 కిలోమీటర్లకు తక్కువ కాకుండా ప్రతిరోజూ సైక్లింగ్ చేయడం ద్వారా చక్కని ఆరోగ్యాన్ని పొందవచ్చు. 75 ఏళ్ల వయస్సులో ఇప్పటికీ నేను నిత్యం నా విధులను ఎంతో ఉత్సాహంగా నిర్వర్తించగలుగుతున్నాను.

-డాక్టర్ మందుల మోహనరావు

చిన్నప్పటి నుంచి సైకిల్‌తోనే ప్రయాణం..



జి.సిగడాం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నాకు ఊహ తెలిసినప్పటి నుంచి సైకిల్‌పై ప్రయాణం చేస్తున్నాను. సుదూర ప్రాంతాలకు కూడా సైకిల్‌పైనే వెళ్లేవాడిని. నా కూతురి ఇంటికి కూడా రానుపోను సుమారు 150 కిలోమీటర్లు ప్రయాణం చేసేవాడిని. ప్రతి గురువారం రాజాంలో జరిగే సంతకి సైకిల్‌పైనే వెళుతుండేవాడిని. మాది దర్జీ వృత్తి. వృత్తి రీత్యా గ్రామాలకు వెళ్లేటపుడు సైకిలే ఆధారంగా ఉండేది. నా వయస్సు 83 ఏళ్లు. 80 ఏళ్ల వచ్చే వరకూ సైకిల్‌నే వాడాను. సైకిల్ వాడటంతో ఇప్పటికీ ఆరోగ్యంగానే ఉన్నాను. ర్యాలీ, రాయిల్ అట్లాస్ కంపెనీలు ఉండేవి. వాటి ధర కూడా వంద, రెండొందలు ఉండేది.

-సోపేటి చిన్న, వృద్ధుడు, పెంట, జి.సిగడాం మండలం

సైకిల్ ప్రయాణం ఇష్టం..



కవిటి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కాలం ఎంత మారినా తన వాహనాన్ని... ఆరోగ్యకరమైన అలవాటును మార్చుకోనని చెబుతున్నారు బి.హేమాచలం. కవిటి కొత్తూరు గ్రామానికి చెందిన ఈయన తన చిన్నతనం నుంచి సైకిల్‌పైనే ప్రయాణాన్ని సాగిస్తున్నారు వయసు 70 వసంతాలకు చేరుతున్నా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా సైకిల్‌పైనే వెళ్లటం ఆయనకు ఎంతో ఇష్టం. పది కిలోమీటర్ల వరకు సైకిల్‌పైనే వెళి పనులు ముగించుకొని రావడం అలవాటుగా మారిందని హేమాచలం చెబుతున్నారు. యుక్తవయస్సులో రూ.502 పెట్టి కొన్న సైకిల్‌నే నేటికీ వినియోగిస్తూ వస్తున్నానని చెబుతున్నారు. తన చిన్నతనంతో రహదారులు సక్రమంగా లేకపోయినా సరే కచ్చా రోడ్లపైనే 20 కిలోమీటర్ల వరకు ప్ర యాణం చేసే వారమని చెబుతున్నారు. ఎంతదూరమైనా... యువకులంతా కలసి ఒక్కో సైకిల్‌పై ఇద్దరం కూర్చొని తొక్కుకుంటూ ప్రయాణం చేసి వచ్చే వారమని చెబుతున్నారు. రాలీ, అట్లాస్ వంటి కంపెనీలకు చెందిన సైకిళ్లపై ప్రయాణించడంలోని ఆనందమే వేరని అంటారాయన. నేడు సైకిల్ రిపేరు వస్తే సక్రమంగా చేసిపెట్టే వారు కనుమరుగైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి ధరలు కూడా రూ.వేలల్లో పలుకుతున్నాయన్నారు. నేడు చిన్నపిల్లలు తప్పితే యువకులు సైకిల్ తొక్కాలంటే ఆసక్తి చూపడం లేదని అంటున్నారు. ఈ వయస్సులో కూడా హేమాచలం సైకిల్ పైనే ప్రయాణం చేయడం విశేషంగానే చెప్పాలి.

బోనస్ డబ్బులతో సైకిల్ కొన్నాను..



పలాస, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పలాస రైల్వేస్టేషన్ రోడ్డులోని జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న రఘునాథ పండా ఇప్పటికీ అట్లాస్ సైకిల్‌పైనే నిత్యం ప్రయాణిస్తారంటే నమ్మశక్యం కాదు. ఆయన సైకిల్ వెనుక పెద్ద కథే ఉంది. రైల్వే ఫిట్టర్‌గా పలాస, ఖుర్దా రైల్వే స్టేషన్లలో 2014 వరకూ పనిచేశారు. కాశీబుగ్గ పూజారివీధిలో ఆయన ప్రస్తుతం నివాసం ఉంటున్నారు. ఉద్యోగ విరమణ తరువాత ఇంటిలో ఖాళీగా ఉండకుండా సరస్వతి అమ్మవారి ఆలయంలో అర్చకత్వం చేస్తున్నారు. అప్పట్లో రైల్వే ఉద్యోగికి రైల్వే ఇళ్లు తప్ప ఇతర ఆస్తులు ఉండేవి కావు. చాలీచాలని వేతనాలతో గంపెడు కుటుంబాన్ని నడిపించాల్సిన పరిస్థితి ఉండేది. ఇంటిలో టీవీ, సైకిల్ ఉంటే వారు సంపన్నుల కిందే లెక్క. తాను కూడా ఆ జాబితాలో చేరాలని రఘునాథ్‌పండా అనుకునేవారు. రైల్వే ఉద్యోగులకు దసరాకు బోనస్ ఇచ్చే సంప్రదాయం ఉంది. ఆయనకు మొదట బోనస్ కింద రూ.1800 దొరకడం తో అట్లాస్ సైకిల్ కొనుగోలు చేసి సంపన్నుల జాబితాలో చేరిపోయాడు. అప్పటి నుంచి ఆ సైకిల్‌ను ఎంతో ఇష్టంగా తొక్కుతూ ఇప్పటికీ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు. తనకు అట్లాస్ సైకిల్‌తో ఎంతో అనుబంధం ఉందని ఆయన చెబుతుంటారు. నిత్యం సైకిల్ తుడవడం, వారినికి ఓసారి కడగడం, మరమ్మతులు ఉంటే సొంతంగా చేసుకోవడం దినచర్యగా పెట్టుకున్నారు. సైకిల్ కొనుగోలు చేసి 40 సంవత్సరాలవుతు న్నా ఇంకా కొత్తగా అది కనిపించడం విశే షం. సైకిల్ ముందు ఇత్తడి నంది బొమ్మ ఉండడం మరో విశేషం. బుల్లెట్లు, ఇతర పెద్ద వాహనాలకు రాజసం కనిపించే విధం గా ఇటువంటి నంది, సింహం బొమ్మలు పెడుతుంటారు. రఘునాథ్‌పండా తన సైకిల్‌కు కూడా రాజసం ఉట్టిపడేలా నంది బొమ్మ ఏర్పాటు చేయడం గమనార్హం. అదండీ రఘునాథ్ పండా అట్లాస్ సైకిల్ కథ.



అర్ధ శతాబ్దపు సైకిల్ యానం..

నరసన్నపేట, జూన్ 2 (ఆంధజ్యోతి): చిన్నతనంలో ఫస్ట్ ఫాం (ఆరో తరగతి) చదువుతున్న ప్పటి నుంచి ఇప్పటి వరకు సైకిల్ మీదనే తన జీవన యాత్ర కొనసాగుతోందని జమ్ము గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు రెడ్డి అప్పలనాయుడు అన్నారు. చదువుకునే రోజుల్లో సైకిల్ మీద జమ్ము నుంచి నరసన్నపేట వెళ్లేవాళ్లమని చెబుతున్నారు. 'థర్డ్‌ఫాం పూర్తి చేసిన తరువాత కొన్నాళ్లకు టీచర్ ట్రైనింగ్ పూర్తయింది. 1967లో ఉపాధ్యాయునిగా తొలిసారిగా నరసన్నపేటలోగల జగన్నాథపురంలో విధుల్లో చేరాను. అప్పట్లో పాఠశాలకు సైకిల్ మీద వెళ్లేవాళ్లం. మధ్యాహ్న భోజనానికి ఇంటికి వచ్చేవాడిని. ఇలా రోజుకు నాలుగుసార్లు తిరిగేవాడిని తరువాత పంతులుపేట, గట్లపాడు, నరసన్నపేట ఇలా నా సర్వీసు మొత్తం అంటే 1997 వరకు సైకిల్ మీద పాఠశాలకు వెళ్లాను. ఉద్యోగ విరమణ చేసి 25 ఏళ్లు పూర్తయింది. ప్రస్తుతం నా వయస్సు 84 సంవత్సరాలు. పెన్షన్ తీసుకోవడానికి సైకిల్ మీద నరసన్నపేట బ్యాంకుకు వెళుతుంటాను. పొలానికి కూడా సైకిల్ పైనే వెళుతుంటా'నని చెబుతున్నారు అప్పలనాయుడు. అప్పలనాయుడు మాస్టారు వినియోగిస్తున్నది హీరో కంపెనీ సైకిల్. తన తండ్రి చిన్నంనాయుడు బతికి ఉన్న రోజుల్లో అంటే 1977కు ముందు కొన్న సైకిలని చెబుతున్నారు. ఈ సైకిల్ వయస్సు 50 ఏళ్లని చెబుతున్నారు.

సైకిల్ నా ప్రాణం..



వజ్రపుకొత్తూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): బీమశంకర్ మహరణ.. ఈ పేరు కంటే కొబ్బరి చిక్కి శంకర్ అంటే ఉద్దానం ప్రాంతంలో అందరికి సుపరిచితులు. ఇప్పుడు ఆయన వయస్సు 75 ఏళ్లు. 50 ఏళ్లుగా సైకిల్‌పైనే గ్రామాల్లో తిరుగుతూ పంచదార చిక్కీల అమ్మకాలు చేస్తున్నట్టు చెబుతున్నారు. సైకిల్‌పై రోజూ 20 కిలోమీటర్లకు పైనే తిరుగుతుండడంతో ఇప్పటికీ తనకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని చెప్పారు. ప్రస్తుతం తొక్కుతున్న సైకిల్ 30 ఏళ్ల కిందటిదని చెప్పారు. ఇప్పటికీ సైకిల్‌పైనే గ్రామాల్లో తిరుగుతూ వ్యాపారం చేస్తున్నట్టు పేర్కొన్నారు.

60 ఏళ్లుగా సైకిలే వారి జీవనాధారం..



సరుబుజ్జిలి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మొదట్లో సరదాలు తీర్చినా... తరువాత అవసరాలు తీర్చే వనరుగా మారిపోయింది సైకిల్. వీటిపై తిరుగుతూ వ్యాపారాలు చేస్తున్న వారు ఎంతోమంది ఉన్నారు. 60 ఏళ్లుగా సైకిల్‌పై వ్యాపారం చేసుకుంటున్న సరుబుజ్జిలి మండలం నందికొండ గ్రామానికి చెందిన చిన్ని కృష్ణ (72) మాట్లాడుతూ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని భామిని మండలం నులకజోడు గ్రామానికి చెందిన తాను 15 సంవత్సరాల వయసు నుంచి సైకిల్ తొక్కుతున్నట్టు తెలిపారు. రోజుకు సుమారు 450 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒడిశా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చుట్టల వ్యాపారం చేసేవాడినని తెలిపారు. వివాహం అనంతరం సరుబుజ్జిలి మండలం నందికొండ గ్రామంలో స్థిరపడ్డానని.. నేటికీ సైకిల్‌పైనే గ్రామాల్లో కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నానన్నారు. మొదట్లో అట్లాస్ సైకిల్ ఉండేదని.. దానిధర రూ.400 నుంచి రూ.500 వరకు ఉండేదన్నారు. సుమారు 20 సంవత్సరాల నుంచి ఒకే సైకిల్‌ను జా గ్రత్తగా వాడుకుంటున్నానన్నారు.

ఐస్‌బండి అదే...



శ్రీకాకుళం పట్టణం బలగ ప్రాంతానికి చెందిన ఇచ్ఛాపురం చిట్టయ్య (75) ఆమదాలవలస పట్టణంలో ప్రతిరోజూ సైకిల్‌పై ఐసు అమ్ముకుంటూ జీవనోపాధి పొందుతున్నానని తెలిపారు. పదేళ్ల వయసు నుంచే సైకిల్‌పై ఐస్ అమ్మడం ప్రారంభించానన్నారు. ఇప్పటివరకు 20 సైకిళ్ల వరకు వాడినట్లు ఆయన తెలిపారు. తన చిన్నతనంలో హెర్క్యులస్, అట్లాస్, హీరో వంటి సైకిల్ కంపెనీలు ఉండేవని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఎన్నో కంపెనీల సైకిళ్లు వస్తున్నాయని, గ్రామాల్లో తిరిగి సైకిల్‌పై వ్యాపారాలు చేసుకోవడానికి అనుకూలంగా అవి ఉండడం లేదన్నారు. తన మొదటి సైకిల్ సెకెండ్ హ్యాండ్ రూ.150కి కొనుగోలు చేశానని తెలిపారు. ప్రస్తుతం తన వద్ద ఉన్న సైకిల్ సుమారు పదేళ్ల కిందటిదని.. దీనిని రూ.3,500కు కొనుగోలు చేసినట్టు ఆయన తెలిపారు.

వ్యవసాయ పనులకు తోడు...



సరుబుజ్జిలి గ్రామానికి చెందిన నందమూడి రమణ అనే కౌలు రైతు మాట్లాడుతూ తన వద్ద ఉన్న 15 ఏళ్లుగా ఉన్న పాత సైకిల్ వ్యవసాయ పనులకు ఎంతో ఉపయోగపడు తోందన్నారు. ఉదయం పొలానికి విత్తనాలు, ఎరువులు, గడ్డిమోపులను సైకిల్‌పైనే తీసుకెళుతుంటానని చెప్పారు.



జిల్లాలో 25 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రిన్సిపాల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పిన్నింటి భానోజినాయుడు (ఫైల్)

ఆ 25 పంచాయతీలు!

(మొదటి పేజీ తరువాయి)

ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

● పాలకవర్గాలు ఉంటేనే నిధులు

గత ప్రభుత్వం కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రయత్నించింది. కానీ ఎక్కడికక్కడే అభ్యంతరాలు, కోర్టు కేసులు ఉండడంతో ఎన్నికలు నిర్వహించలేదు. అందుకే అక్కడ ప్రత్యేకాధికారుల పాలన నడుస్తోంది. పాలకవర్గాలు ఉన్న స్థానిక సంస్థలకే ఆర్థిక సంఘం నిధులు జమ అవుతున్నాయి. ఈ విషయం ప్రభుత్వ పరిధిలో ఉంది. ఉన్నత స్థాయిలో నిర్ణయం తీసుకోవాలి.

-కేబీ సౌజన్య, జిల్లా పంచాయతీ అధికారి, శ్రీకాకుళం

● సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి

మండలంలోనే మా పంచాయతీ అతి పెద్దది. కానీ అప్పట్లో ఎన్నికలు నిర్వహించలేదు. అది మా పాలిట శాపంగా మారింది. కనీసం న్యాయ చిక్కుముడులు అధిగమించే ప్రయత్నం కూడా చేయలేదు. దాని ఫలితం ప్రజలు అనుభవిస్తున్నారు. పారిశుధ్య పనులు లేవు. కనీసం సమస్య చెప్పుకునేందుకు ప్రతినిధి లేకపోవడం ఘోరం.

-వడ్డిపల్లి శ్రీనివాసరావు, బెజ్జిపురం, లావేరు మండలం

● మా పాలిట శాపం

గతంలో మా గ్రామం ఎంతో అభివృద్ధి చెందింది. కానీ నాలుగేళ్లుగా ఎటువంటి అభివృద్ధి లేకుండా పోయింది. పంచాయతీ ఎన్నికలు జరగకపోవమే కారణం. రావాడ పంచాయతీ నుంచి ఉప్పవలస గ్రామాన్ని విడిదీసే ప్రయత్నం చేశారు. ఉప్పవలస రావాడ పంచాయతీలో ఉంచి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి. పాలకవర్గం లేకపోవడం మా పాలిట శాపంగా మారింది.


-లంక ప్రభ, రావాడ, రణస్థలం మండలం

● ఎన్నికలు నిర్వహించాలి

కేసులు తొలగించి జిల్లాలోని 25 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలి. ఆయా పంచాయతీలపై ఉన్న కేసుల కారణంగా స్టాంప్ డ్యూటీ, ఇతరత్రా నిధులు రాక అభివృద్ధి కుంటుపడింది.కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సంఘం నిధులతో పంచాయతీలను అభివృద్ధి చేయాలి.

-పిన్నింటి భానోజినాయుడు, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు

ఎంత అందమో.. ఆకాశానిది!



సాయం సంధ్య వేళ... సూరీడు ప్రత్యేకంగా రంగులద్దాడేమో అన్నట్టుగా ఆకాశం పసుపు వర్ణంతో మెరిసిపోయింది. ఈ దృశ్యం సోమవారం సిక్కోలు నగర వాసులను మంత్రముగ్ధులను చేసింది.

-అరసవల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి)

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం

● తిలకించి.. పులకించిన భక్త జనం



కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు..

హరిపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): దేవదేవుడు.. లోక నాయకుడు.. శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం సోమవారం గోవింద నామస్మరణ మధ్య అంగరంగ వైభవంగా సాగింది. మందస మండలం మఖరజోల గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్యాణ వేదికకు చేరుకున్న బ్రహ్మాండ నాయకుడ్ని వేదపండితులు కోదండచార్యులు, వేమనాచార్యులు పెళ్లికొడుకును చేసి వివాహ ఘట్టాన్ని జరిపించారు. వేలాది మంది భక్తుల నడుమ, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కమనీయంగా నిర్వహించారు. టీడీడీ ఆధ్వర్యంలో.. చిన్నజీయర్ స్వామి శిష్యబృందంతో నిర్వహించిన ఈ వేడుక చూసేందుకు చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం దాతల సహకారంతో భారీ అన్నసంతర్పణ కార్యక్రమాన్ని చేపట్టారు.. గ్రామ యువతతో పాటు పలాస సత్యసాయి ట్రస్ట్ సభ్యులు సేవలందించారు.

'జేఈఈ'లో సిక్కోలు సత్తా

(మొదటి పేజీ తరువాయి)

చూపి మే 4 నుంచి 12 వరకు సౌదీఅరేబియాలో జరిగిన ఏసియాన్ దేశాల పోటీలకు ఎంపికయ్యారు. మెయిన్స్‌లో 99.985 పర్సంటైల్ పొంది జాతీయస్థాయిలో 294వ ర్యాంకు సాధించారు. రుత్విక్ ప్రతిభపై తల్లిదండ్రులతోపాటు అమ్మమ్మ లక్ష్మీబాయ్, మేనమామ కొండల లక్ష్మణబాబు, పెద్దమ్మ లీల, పిన్ని జ్యోతి, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

చిన్ననాటి కల నేరవేరింది..

ఐఐటీ ముంబైలో కంప్యూటర్ సైన్స్ చదవాలని చిన్నప్పటి నుంచి నా తల్లిదండ్రులు తరచూ చెబుతుండేవారు. ఆ కల నేడు నేరవేరిందని దర్మాన జ్ఞాన రుత్విక్‌సాయి అలియాస్ సంతోష్ తెలిపారు. 'తల్లిదండ్రుల మార్గదర్శకాల ప్రకారం ఫిజిక్స్, మ్యాథ్స్ సబెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాను. ఐఐటీ అడ్వాన్స్‌డ్ పేపర్లు కఠినంగా ఇచ్చినా.. ప్రశ్నలు సుదీర్ఘంగా ఉండడం వల్ల వాటిని అర్థం చేసుకోవడానికి ఉత్తరాది కన్నా దక్షిణాది విద్యార్థులకు కొంచెం సమయం పడుతుంది. ఐఐటీకి సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఆంగ్ల భాషపై పట్టు అవసరం. ముఖ్యంగా ప్రశ్నలు చదివి అర్థం చేసుకునేలా ప్రాక్టీసు చేయాలి. ఏడాది ముందు నుంచే ప్రాక్టీసు చేశాను. అందుకు తగిన ఫలితంగా మంచి ర్యాంకు రావడం ఆనందంగా ఉంద'ని రుత్విక్ తెలిపారు. దేశంలో అత్యున్నతమైన ముంబై ఐఐటీలో సీఎస్ కోర్సు పూర్తి చేసిన తర్వాత ఇండియన్ సివిల్ సర్వీసుకు ప్రిపరేషన్ ప్రారంభించి.. ఐఏఎస్ కావాలన్నదే తన లక్ష్యమన్నారు. ఇటీవల జిల్లాకు చెందిన బాన్న వెంకటేష్, గోపాలకృష్ణ, శిబిచక్రవర్తి ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. వారిని ఆదర్శంగా తీసుకోని సివిల్స్‌పై దృష్టి సారించనున్నట్లు జ్ఞాన రుత్విక్ తెలిపారు.

మా భూములను ఇప్పించండి

● 'మీకోసం'లో రేగపాలెం రైతుల వేడుకోలు



గ్రీవెన్స్ వద్ద రైతులు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా తమ స్వాధీనంలో ఉన్న భూములను తమకు ఇప్పించాలని కోరుతూ లావేరు మండలం రేగపాలెంకు చెందిన సుమారు 100 మంది రైతులు సోమవారం జెడ్పీ కార్యాలయంలో జరిగిన మీకోసం కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. రీ సర్వేకు ముందుగా గ్రామసభను కూడా నిర్వహించి, ఎటువంటి ఇబ్బందులు లేవని ఖరారు చేసుకున్నారని తెలిపారు. రీ సర్వేలో భూములు సాగుచేసుకుంటున్న రైతుల పేర్లతో పాటు ఇతరుల పేర్లు ఉన్నాయన్నారు. ఇతరుల నుంచి నిరభ్యంతర పత్రాలను తీసుకురావాల్సిందేనని అధికారులు చెప్పడం దారుణమని అన్నారు పొజిషన్‌ను అనుసరించి ఎవరి భూములు వారికే కేటాయించాలని, రీసర్వే ద్వారా తలెత్తిన ఇబ్బందులను తొలగించాలని కోరారు.

పీఎఫ్ జమలో తేడాతో నష్టపోయాం..

సుమారు నాలుగేళ్లుగా రిమ్స్‌లో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్నామని... తమ పీఎఫ్ ఖాతాల డిపాజిట్లలో తేడాలు ఉన్నాయని... కృష్ణ కనస్ట్రక్షన్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) పారిశుధ్య కార్మికులు సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన గ్రీవెన్స్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికుల పీఎఫ్ ఖాతాల్లో చేసే జమల్లో వ్యత్యాసాల వల్ల ఒక్కో కార్మికుడు సుమారు రూ.లక్ష వరకు నష్టపోయారని తెలిపారు. దీనిపై జేసీ స్పందిస్తూ... సంబంధిత కంపెనీ యాజమాన్యానికి తక్షణమే నోటీసులు జారీ చేయాలని అధికారులను వెంటనే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకుడు డి.గణేష్, సింహాచలం, భాస్కరరావు, అరుణ, శ్యామల, జయప్రద, ఎల్లమ్మ, రాజశేఖర్ కావ్య, పద్మ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించండి..

తమలో అర్హత గలవారికి పదోన్నతులు కల్పించాలని, విధులను వైద్యారోగ్యశాఖకు బదిలీ చేయాలని కోరుతూ సచివాలయాల్లో పని చేస్తున్న ఆరోగ్య కార్యదర్శులు సోమవారం గ్రీవెన్స్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌క వినతిపత్రాన్ని అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 650 మంది ఆరోగ్య కార్యదర్శులుగా పనిచేస్తున్నామని, రెండు శాఖల ద్వారా వివిధ రకాల విధులు నిర్వహిస్తున్నామని, సమస్యలతో, అధికారులు బెదిరింపులతో సతమతమవుతున్నామని అన్నారు. తమను మాతృశాఖకు బదిలీ చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డి.సాయిప్రసాద్, బి.మురళీ, పద్మప్రియ, ధనరెడ్డి తదతరులు పాల్గొన్నారు.

పెద్దమ్మకు ఘనంగా పూజలు

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పాత శ్రీకాకుళంలోని పెద్దమ్మ వారు, నూకాలమ్మకు సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోషిమాత ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున పెద్దమ్మ, నూకాలమ్మ తల్లి దేవర ఏర్పాట్లు చేశారు. మంగళవారం వేయి కాళ్ల ఘటం పూజ నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రహరీల నిర్మాణానికి చర్యలు

గార, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎప్పుడో దశాబ్దాల కిందట నిర్మించిన 22 ప్రభుత్వ పాఠశాలలకు ఎట్టకేలకు ప్రహరీల నిర్మాణానికి మండల అధికారులు కలెక్టర్‌కు నివేదిక పంపించారు. చాలా పాఠశాలలు రోడ్డు పక్కనే రద్దీగా ఉండే ప్రాంతంలో ఉండటం వల్ల తరగతుల నిర్వహణకు ఇబ్బందిగా ఉంటోంది. ఆవరణలో పశువులు, కుక్కలు సంచరిస్తూ ఉంటాయి. ఈ నేపథ్యంలో ప్రహరీల నిర్మాణం వైపు అడుగులు పడడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దేశ సమగ్రత కోసం ఉద్యమిద్దాం

అరసవల్లి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మత సామరస్యం, దేశ సమగ్రత కోసం అందరూ ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక డైమండ్ పార్కు నుంచి సూర్యమహల్ జంక్షన్ వరకు సోమవారం సమైక్యతా యాత్రను నిర్వహించారు. ఈ ర్యాలీలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఆర్.ప్రకాష్, కె.సూరయ్య, ఎం.సత్యం, బి లక్ష్మి, పి.సుధాకర్ పాల్గొన్నారు.

యోగాంధ్రలో భాగస్వాములు కావాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సాగర తీరంలోని పెద్ద గణగళ్లవానిపేటలో మంగళవారం నిర్వహించనున్న యోగాంధ్రలో అందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పిలుపునిచ్చారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎఫ్‌ఓ వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా పాల్గొన్నారు.

అందరూ పాల్గొనాలి...

శ్రీకాకుళం రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పెద్ద గణగళ్లవానిపేట బీచ్‌లో మంగళవారం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. బీచ్‌లో ఏర్పాట్లను ఆయన జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవోలు సాయిప్రత్యూష, కృష్ణమూర్తి, మున్సిపల్ వైద్యాధికారి సుధీర్‌కుమార్, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వేతనం గిట్టుబాటయ్యేలా చర్యలు

ఎచ్చెర్ల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ వేతనదారులు చేసిన పని మేరకు వేతనాలు చెల్లిస్తామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ సుధాకర్ అన్నారు. ఫరీద్‌పేట గ్రామంలోని నారాయణపురం కాలువలో పూడికతీత పనులను ఆయన సోమవారం పరిశీలించారు. మాకు అతి తక్కువగా వేతనాలు వస్తున్నాయని వేతనదారులు పీడీకి విన్నవించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో వేతనదారులకు పనికి తగ్గట్టుగా వేతనం చెల్లించేలా చర్యలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొత్తకోట అమ్మినాయుడు, ఏపీవో శోభాదేవి తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరంలో చిన్నారుల నృత్య ప్రదర్శన



బహుమతులతో చిన్నారులు

ఇచ్ఛాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం రామేశ్వరంలో నృత్యాంజలి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఫెస్టివల్స్-2025 సందర్భంగా పట్టణానికి చెందిన స్వేచ్ఛా నృత్య తరంగిణి చిన్నారులు రెండు గంటల పాటు ఇచ్చిన నాట్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. నాట్యగురువు శివానంద మంగి దివ్య తదితరులు భరతనాట్యం, కూచిపూడి, కథాకళితో ఆకట్టుకున్నారు. ఈ చిన్నారులకు ప్రోగ్రాం ఆర్గనైజర్ శరత్ చంద్ర, అకాడమి అధక్షులు కె.గోవిందరావు, కోశాధికారి మంగి దాలమ్మ అభినందించారు.

నైపుణ్యాలతోనే విజయం

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ శిబిరాల్లో సాధించిన నైపుణ్యంతో వివిధ పోటీలలో రాణించాలని ద్వారా పెంపొందిన నైపుణ్యాన్ని ప్రదర్శించి విజయాన్ని సాధించాలని జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మధుసూదనరావు అన్నారు. స్థానిక పీఎస్ఎన్ఎల్ స్కూల్‌లో నెల రోజులుగా నిర్వహించిన అథ్లెటిక్ వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రీడలను క్రమం తప్పకుండా సాధనచేస్తే తప్పక విజయం సొంతమవుతుందన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి

ఇచ్ఛాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని మండల విద్యాశాఖ అధికారి కె.అప్పారావు అన్నారు. సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 69 పాఠశాలల ఎండీఎం కుక్‌లకు, వంట సహాయకులకు వంట రుచికరంగా ఎలా తయారు చేయాలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 ఎస్.విశ్వనాథం, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు బి.శ్రీనువాసరావు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయండి

ఆమదాలవలస, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4న తలపెడుతున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విజయవంతం చేయాలని వైసీపీ ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ రవిబాబు, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. బొడ్డేపల్లిపేటలో ఉన్న వైసీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చింతాడ రవికుమార్ సురవరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యం: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా విజయమే లక్ష్యంగా కార్యకర్తలు సిద్ధం కావాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో మున్సిపాలిటీకి చెందిన 23 వార్డుల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో పార్టీ కమిటీలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ సుమారు ఆరు సంవత్సరాలు పాలకవర్గం లేకుండా పట్టణ ప్రాంతంలో అభివృద్ధిని అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ శ్రేణులంతా ఐకమత్యంగా పనిచేసి వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో 23 వార్డులలో విజయం సాధించి వైసీపీ నేతలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, మొదలవలస రమేష్, బోర గోవిందరావు, సంపతిరావు మురళీధరరావు, బి.వి.రమణమూర్తి, విజయలక్ష్మీబాయి, వెంకట రాజ్యలక్ష్మి, శ్రీదేవి, సునీత, గురయ్య, మురళీ యాదవ్, ఆంజనేయులు, మాలిక్ పాల్గొన్నారు.

ఉపాధి కల్పించడమే ధ్యేయం

బూర్జ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మహిళలకు అన్ని రంగాల్లో స్వయం ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని పీయూసీ ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ పేర్కొన్నారు. పెద్దపేట గ్రామ సచివాలయంలో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కుట్టుమిషన్ల ద్వారా మహిళలు ఆర్థికంగా బలబడి... మరికొందరికి ఉపాధి ఇచ్చే విధంగా ఉండాలని సూచించారు. ఈ కార్య క్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వ ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎచ్చెర్ల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఆధ్యాతిక చింతనతో మానసిక ప్రశాంతత ఉంటుందని స్థానిక శాసనసభ్యుడు నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. అల్లినగరంలో సోమవారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, ఎచ్చెర్ల, లావేరు మండలాల టీడీపీ పార్టీ అధ్యక్షుడు బెండు మల్లేశ్వరావు, ముప్పిడి సురేష్, కూటమి నేతలు పైడి ముఖలింగం, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో అధిక దిగుబడులు

సరుబుజ్జిలి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో ముందస్తు ప్రణాళికలతో అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త జ్యోతిబసు తెలిపారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రొట్టవలసలో ఖరీఫ్ సన్నద్ధతపై రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

అధికారుల తీరుపై కూటమి నేతల అసంతృప్తి



అధికారులను నిలదీస్తున్న కూటమి నేతలు

రణస్థలం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలంలో పలువురు అధికారుల తీరుపై కూటమి నేతలు అసంతృప్తి వ్యక్తంచేశారు. టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, కూటమి నేతలు కొత్తకోట అమ్మినాయుడు, జీరు రామారావులతో పాటు మరికొంత మంది సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమానికి హాజరై అధికారుల తీరును నిరసించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇప్పటికీ పలువురు అధికారులు ప్రభుత్వ ప్రాధాన్యాలను పట్టించుకోవడం లేదన్నారు. ఉపాధి వేతనదారులకు రోజుకు స్వల్ప మొత్తమే వస్తున్నట్టు వివరించారు. దీనివల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఉపాధి పనుల కొలతలను ఖచ్చితంగా పరిశీలించి, వేతనదారులకు న్యాయం చేయాలన్నారు. తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చేవరకు కదిలేదని స్పష్టం చేశారు. వేతనాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని అధికారులు చెప్పడంతో కూటమి నేతలు శాంతించారు.

ప్రజా ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం:ఏఎస్పీ

శ్రీకాకుళం క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదిక కార్యక్రమం (పీజీఆర్ఎస్)లో స్వీకరించే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యమిచ్చి.. చట్టం ప్రకారం పరిష్కార చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను అదనపు ఎస్పీ కె.వి.రమణ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్య క్రమంలో అదనపు ఎస్పి 51 మంది ఫిర్యాదుదారులు నుంచి వినతులు స్వీకరించారు. వీటికి సంబంధించి తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని అదనపు ఆదేశించారు.

అమ్మవారికి ఆభరణాల సమర్పణ



ఆభరణాలను తీసుకొస్తున్న ఎమ్మెల్యే అశోక్

కంచిలి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కంచమ్మతల్లి సంబరాలలో భాగంగా అమ్మవారికి ఆభరణాలను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సోమవారం రాత్రి సమర్పించారు. ఈ సందర్భంగా ఊరేగింపు కార్యక్రమంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు, సోంపేట సీఐ మంగరాజు, దత్తత గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

విద్యుత్ షాక్‌తో మృతిచెందిన వారి కుటుంబాలతో పాటు గాయపడిన వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. సామంత పుట్టుగ (చిల్లాపుట్టుగ)లో విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు చిన్నారులతో పాటు ఒక వ్యక్తి మృతి చెందిన విషయం విదితమే. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. విద్యుత్ శాఖాధికారులతో ఫోన్‌లో మాట్లాడి... శాఖాపరంగా బాధితులకు పరిహారం అందేలా చూడాలన్నారు. అనంతరం బాధిత కుటుంబాల సభ్యులతో మాట్లాడుతూ ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జగబంధు దొళాయి, ఎస్సీ సెల్‌రాష్ట్ర కార్యదర్శి మర్రిపాటి పూర్ణ, బి.దుర్గాశ్రీనివాస్, బి.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్‌ను వినియోగించుకోండి



అధికారులతో చర్చిస్తున్న ఎంపీ కలిశెట్టి

రణస్థలం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. తన స్వగ్రామం వి.ఎస్.పురంలో సోమవారం అధికారులతో కలసి పర్యటించారు. పీఎం సూర్యఘర్ పథకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నెల రోజుల వ్యవధిలో ఈ పథకం శతశాతం అమలు జరిగే విధంగా కృషి చేస్తానని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు.

పాత ప్రభుత్వ కార్యాలయాలు కూల్చివేత



సమితి కార్యాలయాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

గార, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా సేవలందించిన ప్రభుత్వ కార్యాలయాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. దశాబ్దాల పాటు వెలుగు, ఉపాధి పథకం కార్యాలయాలుగా నిర్వహించిన భవనాన్ని వంతెన అప్రోచ్ రోడ్డు పనుల కోసం ఇంజినీరింగ్ అధికారులు సోమవారం సాయంత్రం యంత్రాలతో కూల్చివేత పనులు ప్రారంభించారు.

జన సైనికుల కుటుంబాలకు బీమా పంపిణీ



చెక్కులు అందజేస్తున్న నాగబాబు

శ్రీకాకుళం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రమాదవశాత్తు మరణించిన 101 మంది జనసైనికులకు ప్రమాద బీమా వర్తింపజేసి.. సంబంధిత కుటుంబాలకు చెక్కులను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు అందజేశారు. మంగళగిరిలోని ఆర్ఆర్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. వజ్రపుకొత్తూరు మండలం సుంకర జగన్నాథపురం గ్రామానికి చెందిన జనసైనికుడు డొంకాన లింగరాజు రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం గ్రామానికి చెందిన మూగి ఎర్రయ్య చేపలవేటకు సముద్రంలోకి వెళ్లి ప్రమాదవశాత్తు మరణించాడు. ఈ మేరకు లింగరాజు తల్లి రెయ్యమ్మకు, మూగి ఎర్రయ్య కుటుంబ సభ్యులకు రూ. 5లక్షల చొప్పున చెక్కులను నాగబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా జనసేన అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, పలాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి డా. వేగులాడ దుర్గారావు, ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి డా. విశ్వక్‌సేన్, క్రియాశీల వలంటీర్లు పాల్గొన్నారు.

రాపాక వాసి కుటుంబానికి...

పొందూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాపాక గ్రామానికి చెందిన జనసేన క్రియాశీల కార్యకర్త పతివాడ సింహాచలం రెండేళ్ల క్రితం ప్రమాదంలో మృతిచెందారు. ఆయన కుటుంబానికి ప్రమాద బీమా కింద మంజూరైన రూ.5 లక్షల చెక్కును సోమవారం మంగళగిరిలోని జనసేన ప్రధాన కార్యాలయంలో అందజేశారు. ఈమేరకు రూ.5 లక్షల చెక్కును జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు చేతులమీదుగా సింహాచలం తల్లికి అందించారు.

ప్రధాన రైళ్లను నిలిపేలా చూడండి

ఇచ్ఛాపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నియోజకవర్గ గల రైల్వే స్టేషన్‌లలో ప్రధాన రైళ్లను నిలుపుదల చేయాలని జడ్ఆర్‌యూఈసీ సభ్యులు శ్రీనివాస్ రౌలో రైల్వే అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం భువనేశ్వర్‌లో జనరల్ మేనేజర్ కేకే గడంగ, చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ వైఎస్ బాబు, కమర్షియల్ మేనేజర్ డాక్టర్ పౌల్‌లకు విడివిడిగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో యశ్వంత్‌పూర్, పూరి-అహ్మదాబాద్, సమతా ఎక్స్‌ప్రెస్ హాల్ట్ కల్పించాలని కోరారు. మందసలో విశాఖ ఎక్స్‌ప్రెస్, జాడుపూడి, బారువ స్టేషన్లలో బర్హంపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ కల్పించాలని కోరారు.

బీఎస్సీ పారామెడికల్ ఫలితాల్లో బొల్లినేని విద్యార్థుల ప్రతిభ

శ్రీకాకుళం రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): బీఎస్సీ పారామెడికల్ ఫలితాల్లో బొల్లినేని విద్యార్థులు సత్తా చాటారు. ఎన్టీఆర్ యూనివర్సిటీ విడుదల చేసిన ఫలితాల్లో మొదటి సంవత్సరం నుంచి యు.వాగ్దేవి(540) రెండో ర్యాంకు సాధించింది. అనస్తీషియా విభాగం నుంచి బి.బిందు 4వ ర్యాంకు, యశ్వంత్ 6వ ర్యాంకు సాధించారు. ఆప్టోమెట్రీ విభాగం నుంచి సీపాన సునీత 2వ ర్యాంకు, బరాటం భార్గవి 5వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. రేడియాలజీ విభాగం నుంచి షణ్ముఖశ్రీ 4వ ర్యాంకు, న్యూరోఫిజియాలజీ టెక్నాలజీ నుంచి ప్రసన్న 3వ ర్యాంకు సాధించి.. యూనివర్సిటీ టాప్ ర్యాంకర్‌గా నిలిచారు. రెండో సంవత్సరం విద్యార్థులలో డి.ప్రవల్లిక 4వ ర్యాంకు, జి.ఉర్జిత 2వ ర్యాంకు, సాయి అభిషేక్ 4వ ర్యాంక్‌లతో యూనివర్సిటీ టాపర్స్‌గా నిలిచారు. ఈ మేరకు డా. బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను సోమవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మీపద్మజ, సిబ్బంది పాల్గొన్నారు. బీఎస్సీ పారామెడికల్ డిప్లమో కోర్సులలో ప్రవేశాలు జరుగుతున్నాయని తెలిపారు. వివరాల కోసం 7680945357, 7995013422 నంబర్లను లేదా జెమ్స్ ఆసుపత్రిలో తమ సంస్థను సంప్రదించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.



టాప్ ర్యాంకర్లను అభినందిస్తున్న నాగేశ్వరరావు

నేడు చింతామణి ఉత్సవం

కవిటి, జూన్2 (ఆంధ్రజ్యోతి): కవిటిలోని శ్రీచింతామణి అమ్మవారి ఉత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నామని ఉషోదయ యువజన సంఘం ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. సంబరం సందర్భంగా ఒడిశా, ఆంధ్ర కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

తైక్వాండోలో ప్రతిభ

ఆమదాలవలస, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అక్కులపేట గ్రామానికి చెందిన బెండి నిఖిల ప్రియ తైక్వాండో పోటీల్లో సత్తా చాటింది. ఒడిశా రాష్ట్రం కటక్‌లో జరిగిన జాతీయ తైక్వాండో పోటీల్లో అండర్-14 విభాగంలో బంగారు పతకం సాధించింది. గతంలో తిరుపతిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పోటీల్లో ఆమె పాల్గొన్నారు. గతంలోనూ ఆమె వివిధ పోటీల్లో పతకాలు సాధించారు.

పడిపోయిన జీడిపప్పు అమ్మకాలు

- పరిశ్రమల్లో పేరుకుపోయిన నిల్వలు
- ఆశించిన స్థాయిలో జరగని విక్రయాలు
- నష్టాల్లో జీడి వ్యాపారులు
- అధిగమించేందుకు ఈ నెల 14 వరకు బంద్



ఓ జీడి పరిశ్రమలో పేరుకుపోయిన జీడిపప్పు నిల్వలు

పలాస, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జీడిపిక్కల ధరలు పెరగడంతో ఆశించిన స్థాయిలో పప్పు అమ్మకాలు జరగడం లేదు. దీంతో జీడి పరిశ్రమలు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నాయి. పరిశ్రమల్లో పప్పు నిల్వలు పేరుకుపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో పరిశ్రమలు బంద్ పాటిస్తే కుదుటపడొచ్చని జీడి వ్యాపారులు భావిస్తున్నారు. ఈ నెల 14వ తేదీ వరకూ పరిశ్రమలు బంద్ పాటించి ఉన్న నిల్వలు అమ్మకాలు చేపట్టడం ద్వారా నష్టాన్ని భర్తీ చేసేందుకు వ్యాపారులు చర్యలు చేపట్టారు. దీంతో మొత్తం రెండు వారాల పాటు జీడి పరిశ్రమలు బంద్ పాటిస్తున్నామని, వ్యాపారులు, కార్మికులు తమకు సహకారం అందించాలని జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. సాధారణంగా జూలైలో జీడి పప్పు అమ్మకాలు మందకొండిగా జరుగుతుంటాయి. ప్రస్తుతం పలాస మార్కెట్‌లో అన్నీ ఆధునిక యంత్రాలు ఏర్పాటు చేయడంతో ఉత్పత్తి సామర్థ్యం అమాంతం పెరిగిపోయింది. అందుకు తగిన అమ్మకాలు లేకపోవడం, ముఖ్యంగా నార్త్‌ఇండియా ప్రాంతంలో జీడి పప్పుకు గిరాకీ తగ్గడంతో పలాస జీడికి మార్కెట్ లేకుండా పోయింది. దీనికి తోడు జీడి పిక్కల ధరలు కూడా బస్తా రూ.13,500 వరకూ ఉండడంతో దానికి అనుగుణంగా పప్పు ధరలు పెరగలేదు. దీంతో వ్యాపారులు నష్టాలను చవిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్మికులు, వ్యాపారులతో చర్చించిన మీదట రెండు వారాలు బంద్‌కు పిలుపునివ్వడంతో సోమవారం నుంచి జీడి పరిశ్రమలు మూసివేశారు.

నష్టాలు అధిగమించేందుకే..

ఈ వ్యవహారంపై పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఉత్పత్తికి తగిన విధంగా అమ్మకాలు లేకపోవడం వల్ల చిన్న జీడి పరిశ్రమలు పూర్తిగా నష్టాల్లో ఉన్నాయన్నారు. దీన్ని అధికమించాలంటే బంద్ పాటించి రెండు వారాల పాటు పరిస్థితి చూడడం జరుగుతుందన్నారు. మార్కెట్‌లో ధరలు పెరిగితే పరిశ్రమలు యథాతథంగా తెరవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఆధునిక యంత్రాలు పరిశ్రమల్లో నెలకొల్పడం వల్ల ఉత్పత్తి అమాంతంగా పెరిగిపోయిందని, ప్రస్తుతం అన్నీ పరిశ్రమల్లో జీడి పప్పు నిల్వలు భారీ స్థాయిలో పేరుకుపోయావన్నారు.

5 నుంచి పాంచరాత్రి కల్యాణ మహోత్సవాలు

- శ్రీముఖలింగంలో ఏర్పాట్లు
- చివరి రోజున స్వామివారి చక్రతీర్థ స్నానం



శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయం



పూజలందుకుంటున్న స్వామివారు

జలుమూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి) దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలో గల శ్రీముఖలింగేశ్వరస్వామి పాంచరాత్రి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 5వ తేదీ గురువారం నుంచి 11వ తేదీ బుధవారం వరకు వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. 5న గురువారం రాత్రి ధ్వజారోహణ, అష్టదిక్పాలకులకు ఆహ్వానం, 6న స్వామివారి కల్యాణం, నంది వాహనంపై పార్వతీ పరమేశ్వరుల గ్రామోత్సవం ఉంటుందన్నారు. 7న శనివారం ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ కార్యక్రమం, 8న ఆదివారం పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు, 9న సోమవారం సదస్య మహోత్సవం, 10న మంగళవారం దొంగవల్లి, 11న బుధవారం వంశధార నదిలో పార్వతీ పరమేశ్వరుల చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

ప్లాస్టిక్ నుంచి పొంచిఉన్న ప్రమాదం

- ప్రజా దర్బారులో వినతులు స్వీకరించిన మంత్రి అచ్చెన్నాయుడు



క్లాత్ బ్యాగులు ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కాలుష్యం మూలంగా పర్యావరణానికి పెను ప్రమాదం పొంచి వుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని క్లాత్‌బ్యాగులను ఆవిష్కరించడంతోపాటు ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కరుణశ్రీ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలుగు నష్టాన్ని వివరించారు. నియోజకవర్గం పరిధిలోని ప్రజలు భారీగా తరలివచ్చి సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాలు అందించారు. అనంతరం టెక్కలి, నందిగాం మండలాలకు సంబంధించి పాతనౌపడ, శాసనాం, కాపుతెంబూరు, వల్లభరాయుడుపేట, మొండ్రాయివలస గ్రామాలకు సంబంధించిన ఫీల్డ్‌అసిస్టెంట్ల నియామక ఉత్తర్వులు అందజేశారు.

భార్య చనిపోయిన మూడోరోజే భర్త మృతి

- ఇద్దరూ కిడ్నీ బాధితులే.. ● అక్కుపల్లిలో విషాదఛాయలు




లండ అప్పన్న, కర్రెమ్మ (ఫైల్)

వజ్రపుకొత్తూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): భార్య మృతి చెందిన మూడు రోజుల తర్వాత భర్త చనిపోయిన ఘటన సోమవారం అక్కుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. అక్కుపల్లి గ్రామానికి చెందిన లండ కర్రెమ్మ (60), లండ అప్పన్న(65) భార్యభర్తలు. వీరిద్దరూ గత కొన్నాళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడు తున్నారు. ఈ క్రమంలో కర్రెమ్మ గత నెల 31 కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతిచెందారు. అయితే భార్య మృతి చెందిందన్న దిగులుతో కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న అప్పన్న కూడా మంచానపడ్డాడు. ఈ క్రమంలో భార్య చనిపోయిన మూడో రోజు సోమవారం అప్పన్న కూడా కన్నుమూశాడు. దీంతో మూడు రోజుల వ్యవధిలో భార్య భర్తలిద్దరూ మృతిచెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. వీరికి నలుగురు సంతానం కాగా వీరిలో ఒకరు గతంలో చనిపోగా, మరొకరు కొన్నేళ్లుగా ఆచూకీ లేకుండా పోయారు.

ఆపదలో ఉన్న వారికి చేదోడుగా నిలుస్తాం

పలాస, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ఉద్దేశమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో 14 మంది బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.8.71 లక్షల విలువైన చెక్కులను అందించారు. మెరుగైన వైద్యానికి పేదరికం అడ్డుకాకూడదన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. అలాగే తన చాంబర్‌లో గ్రీవెన్స్ నిర్వహించి బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, సీనియర్ నాయకులు దువ్వాడ హేమబాబుచౌదిరి, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

● హరిపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మందస మండలం మఖరజోల గ్రామంలో సోమవారం జరిగిన శ్రీనివాసుని కల్యాణోత్సవంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శివాజీ పాల్గొన్నారు. టీడీపీ నాయకులు బావన దుర్యోధన, జీకే నాయుడు, రట్టి లింగరాజు, కొర్ల కన్నారావు తదితరులు పాల్గొని స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలతో కరాటే విద్యార్థులు

హిరమండలం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): విశాఖలో ఆదివారం నిర్వహించిన సౌత్ ఇండియా స్టేట్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో హిరమండలానికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు. సుభలయ ఆర్ఆర్ కాలనీకి చెందిన తోట గుణశ్రీ అండర్-13 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. అలాగే తోట రూప్సీ లక్ష్మీ అండర్-16 విభాగంతో గోల్డ మెడల్ సాధించింది. అలాగే మరి కొంద మంది విద్యార్థులు కూడా పతకాలు సాధించారు. వీరిని శిక్షకుడు తోట సింహాచలం తదితరులు అభినందించారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపివేస్తాం



కోవిలాం సమీపంలోని కాలువ పనులు పరిశీలిస్తున్న డీఈ మురళి

ఎల్ఎన్ పేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సాగునీరందించే కాలువల మరమ్మతు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేకుంటే బిల్లులను నిలిపివేస్తామని వంశధార కుడిప్రధాన కాలువ పనుల విభాగం డీఈ మురళి స్పష్టం చేశారు. మేరకు వంశధార నది కుడి ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న పిల్లకాలువల్లో జరుగుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. రైతుల పంటపొలాలకు సాగునీరందించే పిల్లకాలువల మరమ్మత్తులకు, పూడికతీత పనులకు శాఖాపరంగా గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరు కావడంతో పనులు చేయిస్తున్నామన్నారు. ఈయనతోపాటు ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా హలహలేశ్వర స్వామి ఉత్సవాలు



పూజలు చేస్తున్న రుత్వికులు

నరసన్నపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపాడులో హలహలేశ్వర స్వామి ఆలయ పునః ప్రారంభోత్సవ కార్యక్రమాలు సోమవారం ఘనంగా ప్రారంభమ య్యాయి. విగ్రహాలతో శోభాయాత్ర, తిరువీధి నిర్వహించారు. అనంతరం పుణ్యనదుల జలాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో సత్యవరగ్రహార పండితులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జడ్డమ్మతల్లి గ్రామదేవత పండుగలు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

టెక్కలి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పాతపట్నం మండలం బూరగాంలో జడ్డమ్మతల్లి గ్రామదేవత పండగలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు ముర్రాటలతో అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం దేవర తీసుకువచ్చి, పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే బగ్గు పరామర్శ



కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): దీర్ఘాశిలో ఇటీవల మృతిచెందిన సీనియర్ నేత, సమీప బంధువు పాగోటి మోహన్‌కృష్ణ కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తన అనుచరులతో వెళ్లి పరామర్శించారు. మోహన్‌కృష్ణ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంవీ నాయుడు, భైరి భాస్కరరావు, పల్లి సూరిబాబు, మెండశ్రీనివాసరావు ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నరసన్నపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): యోగా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని ఆయుష్ వైద్యులు వెలమల సీతామహాలక్ష్మి అన్నారు. సోమవారం కోమర్తి, యారబాడు గ్రామ సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో యోగాపై అవగాహన కల్పించారు.

● కొత్తూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి యోగాను దినచర్యగా అలవర్చుకోవాలని స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు. వేసవి సెలవులు అనంతర కళాశాల పునఃప్రారంభమైన మొదటి రోజు యోగాంధ్రలో భాగంగా విద్యార్థులతో ఆసనాలు వేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. యోగా వలన శరీరక ఆరోగ్యం, మానిసిక ప్రశాంతత కలిగిస్తుందన్నారు. అనంతర పలురకాల యోగా ఆసనాలను శిక్షకులు సీరాపు రాజు విద్యార్థులు, అధ్యాపకులకు యోగాలో మెలకులు తెలిపారు.

పారదర్శకంగా రేషన్ పంపిణీ



వజ్రపుకొత్తూరు: గరుడుభద్రలో రేషన్ పంపిణీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

వజ్రపుకొత్తూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పారదర్శకంగా రేషన్ సరుకులు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సోమవారం గురుడుభద్ర రేషన్ డిపోలో లబ్ధిదారులకు రేషన్ సరుకులు పంపిణీ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీతారామ్మూర్తి, డీటీ బి.మురళీకృష్ణ, డీలర్ ఈశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు బట్టుపాడులో జరుగుతున్న గ్రామ దేవత ఉత్సవాలల్లో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు.

● హరిపురం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మందస మండలం మఖరజోల గ్రామంలో రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష సోమవారం ప్రారంభించి, లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మిస్కా శ్రీకాంత్, టీడీపీ నాయకులు బావన దుర్యోధన, బమ్మిడి కర్రయ్య, రట్టి లింగరాజు, పీరుకట్ల విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దకు వెళ్లి వృద్ధులకు..

పలాస రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మాకనపల్లి గ్రామంలో సోమవారం రేషన్ సరుకులను ఎమ్మెల్యే గౌతు శిరీష వృద్ధులకు వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల పక్షాన ఉంటూ సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. డిపోల వద్దకు రాలేని వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ అందించేలా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణకుమార్, నాయకులు పీరికట్ల విఠల్, తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తి, సీఎస్‌డీటీ గిరి తదితరులు ఉన్నారు.

వ్యాన్‌ను ఢీకొన్న లారీ

- ప్రమాదంలో క్లీనర్ మృతి



ప్రమాదానికి గురైన వ్యాన్, లారీ



క్లీనర్ సల్మాన్ మృతదేహం

నరసన్నపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై నరసన్నపేట శివారున జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజస్థాన్ రాష్ట్రం భరత్‌పూర్ జిల్లాకు చెందిన లారీ క్లీనర్ సల్మాన్ (19) మృతి చెందినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. చెన్నై నుంచి బాలసూర్ వెళ్తున్న కార్గో లారీ.. ముందువెళ్తున్న వ్యాన్‌ను ఢీకొంది. దీంతో ముందువెళ్తున్న వ్యాన్ డివైడర్ పైకి వెళ్లి నిలిచిపోగా.. కార్గో లారీ ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో లారీ క్లీనర్ సల్మాన్ అక్కడక్కడే మృతిచెందారు. హైవే అధికారులు ఘటన స్థలానికి చేరుకుని పోలీసులు సాయంలో వాహనాలను పక్కకు నెట్టారు. మృతిడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

టెక్కలి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): టెక్కలి-తెంబూరు రోడ్డు వలేసాగరం సమీపంలో సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా టెక్కలి ఆదిఆంధ్రావీధికి చెందిన చిట్టా ఎర్రయ్య 620గ్రాముల గంజాయితో పట్టుబడ్డారు. అతడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. 2023 జూలైలో కూడా ఈయనపై కేసు నమోదైనట్టు సీఐ స్పష్టం చేశారు.

భర్త వేధింపులపై భార్య ఫిర్యాదు

ఎచ్చెర్ల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): అల్లినగరం గ్రామానికి చెందిన చిన్ని భవానీ తన భర్త తాన్ని శ్రీను వేధిస్తున్నాడంటూ సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అల్లినగరం గ్రామానికి చెందిన భవానీతో శ్రీకాకుళం రూరల్ మండలం తంగివానిపేట గ్రామాని చెందిన శ్రీనుతో కొన్నేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఒక పాప ఉంది. అయితే శ్రీను అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని ఆమె ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

ఎమ్మెల్యే శిరీష పేరుతో వసూళ్లపై ఫిర్యాదు



సీఐకు ఫిర్యాదు కాపీ అందిస్తున్న విఠల్‌రావు

పలాస, జూన్ 2(ఆంధ్రజ్యోతి): తన పేరుతో వసూళ్లకు పాల్పడుతూ.. తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే గౌతు శిరీష కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ఆ ఫిర్యాదు కాపీను టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణకు అందించారు. ఎమ్మెల్యే పేరు చెబుతూ డీఎస్సీ అభ్యర్థులకు ఫోన్ చేసి ఉపాధ్యాయ పోస్టులు ఇప్పిస్తామని, అందుకు ముందుగా రూ.2100 ఫోన్‌పే ద్వారా చెల్లించాలని చెబుతున్నారని, దీనిపై దర్యాప్తు వసూళ్లకు పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

శ్రీకాకుళం రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సింగుపురం పంచాయతీ కొండమ్మతల్లి కాలనీ నాలుగో లైన్ జాతీయ రహదారి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (62) మృతదేహాన్ని ఉన్నట్టు వీఆర్వో విశ్వేశ్వరరావు సోమవారం సమాచారం అందించినట్టు శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ కె.రాము తెలిపారు. వెంటనే సిబ్బందితో ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుడు శరీరంపై ఆఫ్ తెలుపు రంగు బనియన్, నీలం రంగు లుంగీ ఉన్నాయన్నారు. వివరాలు తెలిపిన వారు రూరల్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

డయాలసిస్ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పలాస, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పలాస కిడ్నీ ఆసుపత్రిలో డయాలసిస్ చికిత్స పొందుతూ బొడ్డపాడు పంచాయతీ మామిడిపల్లి గ్రామానికి చెందిన వంకల తాతారావు అనే కిడ్నీ బాధితుడు సోమవారం మృతి చెందాడు. మృతుడుకు రెండు కిడ్నీలు పాడవడంతో కిడ్నీ ఆసుపత్రిలో డయాలసిస్ పొందుతుండేవాడు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందడంతో స్వగ్రామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

కంప్యూటర్ ఆపరేటర్‌కు 13 రోజుల రిమాండ్

పొందూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ సువ్వారి సన్యాసిరావుకు పొందూరు కోర్టు 13 రోజుల రిమాండ్ విధించింది. ఇటీవల కార్యాలయంలో బాత్‌రూమ్‌కు వెళ్లిన మహిళా ఉద్యోగిని తన ఫోన్‌లో వీడియో చిత్రీకరించాడు. దీనిపై మహిళా ఉద్యోగులందరూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. సోమవారం సన్యాసిరావుకు కోర్టులో హాజరు పరిచారు. విచారించిన న్యాయాధికారి 13 రోజుల రిమాండ్ విధించారు.

ఆకట్టుకున్న చిన్నారి భరత నాట్యం



నాట్యం చేస్తున్న అదితి

నరసన్నపేట/ జలుమూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతిక ప్రతీకగా నిలిచే భరత నాట్యంను అమెరికాలో నేర్చుకున్న జలుమూరు మండలం యలమంచిలి గ్రామానికి చెందిన వాన కనకయ్య మనమరాలు అదితి నీలం సోమవారం స్థానిక ఒక కల్యాణ మండపంలో ప్రదర్శన ఇచ్చారు. భారతీయ పురాణ గాథల్లో ఇతివృత్తాలను నాట్యరూపంలో చేపట్టిన ఆమె ఇచ్చన ప్రదర్శనలు ఆలోచింప చేశాయి. కార్యాక్రమంలో ఆర్ట్‌ఆఫ్ లివింగ్ సంస్థ జిల్లా అధ్యక్షుడు కింజరాపు అమ్మన్నాయుడు, ధర్మాన లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. భరతనాట్యం పట్ల యూఎస్‌ఏలో ఇనుమడింప చేయాలనే లక్ష్యంతోనే అదితి నీలంకి చిన్నతనం నుంచిశిక్షణ ఇచ్చి ప్రదర్శనలు ఇచ్చామని తల్లిదండ్రులు సునీల్, స్వప్న తెలిపారు. చిన్నారి ప్రదర్శనలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ




చైతన్య

నరసన్నపేట, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మారుతీనగర్‌కు చెందిన బీవీకే చైతన్య జాతీయస్థాయిలో 3,551వ ర్యాంకు సాధించాడు. పదో తరగతి వరక నరసన్నపేట ఓప్రైవేట్ పాఠశాలలో, ఇంటర్ విశాఖలోని ప్రైవేట్ కళాశాలలో చదివాడు. తల్లిదండ్రులు వెంకటరమణ, ఎల్లమ్మ ఇద్దరూ ఉపాధ్యాయులే.



వినయ్‌కుమార్

● సంతబొమ్మాళి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో బోరుభద్ర గ్రామానికి చెందిన మణిపాత్రుని వినయ్‌కుమార్ జాతీయ స్థాయిలో 9,920వ ర్యాంకు సాధించాడు. వినయ్‌కుమార్ ఒకటో నుంచి ఐదో తరగతి వరకు అంపోలు వద్ద గల ఓ ప్రైఏవట్ పాఠశాలలో.. ఇంటర్ విశాఖలోని ఓ ప్రైవేట్ కళాశాలలో సాగింది. వినయ్‌కుమార్ తల్లిదండ్రులు మణిపాత్రుని శ్రీనివాస్, సునీత కాగా, అక్క నవ్యశ్రీ బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతుంది.



అభిషేక్

● పాతపట్నం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పాతపట్నం యశోద నగర్-3కి చెందిన చింతాడ అభిషేక్ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జాతీయ స్థాయిలో 4,780వ ర్యాంకు సాధించాడు. అభిషేక్ తండ్రి కృష్ణారావు ఉపాధ్యాయుడు, తల్లి రోహిణి గృహిణి.



మోక్షలలిత

● సోంపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సానా మోక్షలలిత జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జాతీయ స్థాయిలో 6,644వ ర్యాంకు సాధించింది. మోక్షలలితను విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

నేడు పలాస మండల సమావేశం

పలాస రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పలాస మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉంగ ప్రవీణ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎన్.వసంతరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందువల్ల పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే రేవతీపతి వర్ధంతి



రేవతీపతి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కేంద్ర మాజీ మంత్రి కృపారాణి, మాజీ ఎమ్మెల్యే కొర్ల భారతి తదితరులు

టెక్కలి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎమ్మెల్యే కొర్ల రేవతీపతి వర్ధంతిని సోమవారం స్థానిక పాలకేంద్రం ఎదురుగా గల తొలుసూరుపల్లి రోడ్డులో ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ కార్య క్రమంలో కేంద్ర మాజీమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, మాజీ ఎమ్మెల్యే కొర్ల భారతి, హనుమంతు ఉదయ భాస్కర్, సిగిలపల్లి శిరీష, శ్రీనివాస్, అనిల్‌కుమార్, శ్రవంతి, అనూష తదితరులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టెక్కలి ఎమ్మెల్యేగా ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలాగే రేవతీపతి అభిమానులు నివాళులర్పించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

కొత్తూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నవారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ కొప్పల బాలకృష్ణ అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ.. అంగూరు రెవెన్యూ, పోనుటూరు వద్ద వంశధార నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, వీటికి అడ్డుకట్టు వేసేందుకు రెండు సచివాలయాల వీఆర్వోలను పరిశీలనకు వేసినట్టు తెలిపారు. అంగూరు పరిధి ఆకులతంపర వద్ద రాత్రిపూట జేసీబీలతో లారీల్లో ఇసుకును తరలిస్తున్నారని, పోనుటూరు వద్ద ఒడిశాకు చెందిన ట్రాక్టర్ల ద్వారా ఇసుకు రవాణా జరుగుతున్నట్టు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ మేరకు ఆ రెండు చోట్ల అడ్డుకునేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

బాల కథా సమ్మేళనంలో ప్రశంస

కొత్తూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): కడుము పాఠశాల ఉపాధ్యాయుడు కుదుమ తిరుమలరావు అంతర్జాతీయ అంతర్జాల బాల కథా సమ్మేళనంలో వినిపించిన కథకు ప్రశంస పొందారు. సోమవారం హైదరాబాద్ వేదికగా ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు కేశిరాజు శ్రీనివాస్, గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంతర్జాలం ద్వారా నిర్వహించిన ఈ పోటీల్లో తిరుమలరావు తాను రాసుకున్న మతలబ్ బాల కథను వినిపించి ప్రశంసలు పొందారు. 'అప్పుతీసుకొని తీసుకోలేదని ఒక తండ్రి అబద్ధమాడతాడు. ఆ బకాయిని అతడి కుమారుడు పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచి పూర్వ విద్యార్థులు పారితోషకంగా అందించిన నగదును తన తండ్రికి తెలియకుండా నిజాయతీగా అప్పుతీర్చుతాడు' ఆ విద్యార్థి నిజాయతీని వివరిస్తూ రచించిన మతలబ్ కథకు ప్రశంస అందుకున్నారు. 150 మంది కథకులు ఐదు గంటలు పాటు వివిధ అంశాలపై బాల కథలను వినిపించినట్టు తిరుమలరావు తెలిపారు. తోటి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.


రేపు జగన్‌పాలన విముక్తి దినోత్సవం

పోలాకి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ పాలనలో రాష్ట్రం అనేక ఇబ్బందులు ఎదుర్కొందని, అందుకే గతేడా జూన్ 4న ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చారని ఈ తీర్పునకు గుర్తుగా జగన్ పాలన విముక్తి దినోత్సవం ఈ నెల 4న నిర్వహించనున్నట్టు కూటమి నాయకులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయిలో కూటమి నాయకులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఎంవీ నాయుడు, ఆర్కే నాయుడు, ఎస్ఎన్ దాస్, బీవీ రావు, టీఎల్ నారాయణ, పిలుపునిచ్చారు. ఆ రోజున ప్రతి ఇంటిముందు వాకిళ్లను ముగ్గులతో అలంకరించాలని, సాయంత్రం ఇంటి ముందు దీపాలు వెలిగించి బాణసంచా కాల్చి ఆ వేడుకలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయాలని పిలుపునిచ్చారు.

పేదలకు అండగా..

జలుమూరు, (సారవకోట), జూన్ 2(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు కార్పొరేట్ ఆసుపత్రిల్లో మెరుగైన వైద్యసేవలందించే ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. తన కాంపు కార్యాలయం కత్తిరివానిపేటలో సోమవారం సారవకోట మండలం ధర్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన నీలగిరి మహేష్ శస్త్ర చికిత్స జరిగింది. ఇతడి వైద్య ఖర్చులు నిమిత్తం రు.1,15,543 సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన చెక్కును అందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు డి.జయరాం, హేమసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారుడి మృతి



రామారావు(ఫైల్)

పాతపట్నం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ పాతపట్నం కొత్తదేవాంగులవీధికి చెందిన ఉపాధి వేతనదారుడు యర్ర రామారావు(64) సోమవారం మృతిచెందాడు. రామారావు, భార్య జయతో కలిసి సోమవారం ఉదయం ఉపాధి పనులకు బయలుదేరారు. స్థానిక నీలమణిదుర్గ ఆలయానికి చేరువలో గల దాలి చెరువు వద్ద ఉపాధి పనులు చేసేందుకు వెళ్లి అస్వస్థతకు గురైయ్యాడు. వెంటనే తోటి ఉపాధి వేతనదారులు స్థానిక సీహెచ్‌సీ తరలించారు. అయితే అప్పటికే రామారావు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు రామారావు ఇంటి వద్ద వీఆర్వో అన్నాజీరావు శవపంచనామా నిర్వహించారు.

ఆలయ వార్షికోత్సవం

నందిగాం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): హరిదాసుపురంలో వేంచేసియున్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు టి.రవిశర్మ ఆధ్వర్యంలో విశేషపూజలు, తమలపాకుల అర్చన, హోమం తదితర కార్యక్రమాలు కణితి ఆదినారాయణ, కవిటి చంద్రశేఖర్ దంపతులు చేపట్టారు.

గ్రంథాలయంలో వక్తృత్వ పోటీలు

నందిగాం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్ విభాగాల్లో ఇంపార్టెన్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అంశాలపై నిర్వహించారు.